


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :136 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ శుక్రవారం- 11 - సెప్టెంబర్ - 2026

### రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 18వ బ్రిక్స్ సదస్సులో

## పాల్గొనడానికి భారత్‌కు వస్తున్నారు.

- ❖రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు హెలికాప్టర్లు ఎందుకు నచ్చవు, ఆయన స్మార్ట్ ఫోన్ వాడకపోవడానికి కారణమేంటి?
- ❖దిల్లీలోని భారత్ మండపంలో సెప్టెంబర్ 12నుంచి13వరకు బ్రిక్స్ సదస్సు జరగనుంది.
- ❖నాలుగేళ్ల విరామం తర్వాత పుతిన్ గత డిసెంబర్‌లో ద్వైపాక్షిక సదస్సుకోసం భారత్ వచ్చారు.



ఢిల్లీ: ఈ పర్యటనలో అధ్యక్షుడు పుతిన్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య మరో ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశం ఉందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. పుతిన్ పర్యటనలో ఎప్పటిలాగే ఇరు దేశాలు ద్వైపాక్షిక అజెండాపై చర్చిస్తాయని పెస్కోవ్ చెప్పారు. "మన సహకారం ముందుకు సాగకుండా అడ్డుకోవడానికి కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నందున చాలా విషయాలను బహిరంగంగా చర్చించలేం. అయితే వాటిపై గోప్యంగా, చాలా నిర్మాణాత్మకంగా చర్చలు జరుగుతాయి" అని కూడా పెస్కోవ్ చెప్పారు. మరోవైపు పుతిన్ భద్రతపై మరోసారి చర్చ జరుగుతోంది. పుతిన్ 2000 సంవత్సరం నుంచి అధికారంలో ఉన్నారు. సోవియట్ నియంత జోసెఫ్ స్టాలిన్ తర్వాత క్రెమ్లిన్‌లో ఎక్కువకాలం పదవిలో ఉంది పుతినే. 73 ఏళ్ల వయసులో ఆయన ఐదోసారి అధ్యక్షపదవిలో ఉన్నారు. మిగతా..2లో

### అంతరిక్షం అందరిదీ

### బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి




- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు
- సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు.

### భారత్ అమ్ములపొదిలో

## 190 అణు వార్‌హెడ్లు

- ప్రస్తుతం 730 కిలోల వెపన్ గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా
- 140 నుంచి 225 వార్‌హెడ్లను తయారు చేయవచ్చని వెల్లడి
- భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందన్న అమెరికా



ఢిల్లీ : భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందని అమెరికా పేర్కొంది. 'ఇండియాన్ న్యూక్లియర్ వెపన్స్-2026' పేరుతో ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ డైరెక్టర్ హాన్స్ క్రిస్టెన్సెన్ ఓ కథనం రాశారు. భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్లు ఉన్నట్లు అంచనా వేశారు. ఇందులో 160 ఆపరేషనల్ లాంచర్ల కోసం సిద్ధంగా ఉండగా మరో 30 కొత్త క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నాయని తెలిపారు. వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు, పబ్లిక్ డేటా విశ్లేషణల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు హాన్స్ క్రిస్టెన్సెన్ తెలిపారు. గాలి, నేల, సముద్రం ద్వారా ప్రయోగించగల అణువ్యవస్థలను మిగతా..2లో

### తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు




- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస
- ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో

## రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిసారి

- ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం పడకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, సెప్టెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు గురువారం అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి వివరణాత్మకంగా జవాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో జారీ చేసిందని, పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతోపాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు.

### త్వరలో ఆర్టీసీ కార్మిక

## సంఘాల ఎన్నికలు



- త్వరలో టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రకటించారు.
- హైదరాబాద్ వాసుల కోసం కొత్తగా వంద మినీ బస్సులు తీసుకొస్తున్నట్లు కూడా తెలిపారు.
- అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో టీజీఎస్ ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని అన్నారు. టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల ఎన్నికలపై మిగతా..2లో

### బంగాళాఖాతంలో అల్పపీడనం - అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన



ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు.

అమరావతి: : ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తీర ప్రాంత ప్రజలను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రకు వర్ష సూచన : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. దీని ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో మిగతా..2లో

### తిరుపతివిజయవాడ మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభం



విజయవాడతిరుపతి విమాన ప్రయాణికులకు మరో సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గన్నవరం విమానాశ్రయం నుంచి తిరుపతికి ఫ్లై91 నూతన విమాన సర్వీసు ప్రారంభమైంది. విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ సర్వీసును ప్రారంభించారు. వారంలో నాలుగు రోజుల పాటు విమాన సేవలు కొనసాగనున్నాయి.

కృష్ణా, సెప్టెంబర్ 10: జిల్లాలో తిరుపతివిజయవాడ మధ్య ఫ్లై91 నూతన విమాన సర్వీసు ప్రారంభమైంది. గన్నవరం విమానాశ్రయంలో విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రిబ్బన్ కట్ చేసి ఈ సర్వీసును ప్రారంభించారు. మిగతా..2లో

### డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా




- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు.

### ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

## టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

- ▶▶8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ▶▶కొత్త తరం నాయకత్వ పద్ధతులను అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన
- ▶▶పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం
- ▶▶అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం
- ▶▶ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని పిలుపు



అమరావతి : ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్షిప్ - న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మిగతా..2లో

### కాకినాడ జిల్లాలో పులి సంచారం..

## రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్




- ★కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- ★పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం
- ★అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- ★ప్రజల భద్రతతో పాటు పులికి హాని జరగకుండా చూడాలని స్పష్టీకరణ

మొదటి పేజి తరువాయి

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

# టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

"గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి" అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా

శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం..

# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

అమరావతి : కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తిరుపతివిజయవాడ మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభం

తొలి ప్రయాణికులకు ఆయన స్వయంగా టికెట్లు అందజేశారు. వారంలో నాలుగు రోజుల పాటు తిరుపతివిజయవాడ మధ్య ఈ విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. కొత్త విమాన సర్వీసు అందుబాటులోకి రావడం ద్వారా విజయవాడ, తిరుపతి మధ్య ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. 'కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కృతజ్ఞతలు. ఆదివారం కూడా తిరుపతివిజయవాడ మధ్య విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. గన్నవరం విమానాశ్రయం నుంచి ఎమిరేట్స్, ఖతర్, లుఫ్తాన్సా వంటి అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. గత 12 ఏళ్లలో గన్నవరం విమానాశ్రయం భారీగా అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

## అంతరిక్షం అందరిదీ- బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

ఢిల్లీ : అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు : పొన్నం ప్రభాకర్

సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైనా ఏపీ ఆర్టీసీలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని పేర్కొన్నారు. 347.47 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణం : హైదరాబాద్ నగరానికి వంద మినీ బస్సులు రాబోతున్నాయని మంత్రి ప్రకటించారు. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇదొక రికార్డ్ అని పొన్నం వెల్లడించారు. "ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు

## తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం - అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన

మొదటి పేజి తరువాయి

రానున్న కొద్ది రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 60 కి.మీ వేగంతో గాలులు : తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్ర తీరానికి వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులకు 48 గంటల




హైఅలర్ట్ : సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నందున చిన్న పడవలు, మరబోట్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచార వ్యవస్థల ద్వారా సందేశాలు పంపుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పర్యవేక్షిస్తోంది. అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన : అల్పపీడన ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వరుణుడు ప్రతాపం చూపాడు. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో, ఉక్కపోతతో అల్లాడిపోతున్న స్థానిక ప్రజలను ఈ వర్షం పలకరించింది. వాన కారణంగా పలుచోట్ల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

# భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు

మొదటి పేజి తరువాయి

భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ పేర్కొన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు. అయితే భారత్ తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని ఆయుధాల తయారీకే వాడకపోవచ్చని, కొంత రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని హాన్స్ క్రిస్టెన్సెన్ కథనం పేర్కొంది. ఆయుధ సంపత్తిని పెంచుకున్నప్పటికీ భారత్ తన విధానాలకు కట్టుబడి ఉంది. 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షల తర్వాత భారత్ 'నో ఫస్ట్ యూజ్' సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాలను నిలువరించటానికి మాత్రమేనని పార్లమెంటులోనూ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, మరిన్ని కొత్త క్షిపణి వ్యవస్థలు అభివృద్ధి దశలో ఉన్నందున, రానున్న రోజుల్లో భారత్ అణ్వాయుధాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### ఏఏ దేశాల వద్ద ఎన్ని ఉన్నాయంటే?

ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత మెరుగుపరుచుకుంటున్నాయి. అయితే, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా అమెరికా, రష్యా ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) కొద్దిరోజుల క్రితం ఒక నివేదికలో వెల్లడించింది. రష్యా వద్ద 5,420, అమెరికా వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా, వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో యూకే (225), ఫ్రాన్స్ (370), ఉత్తరకొరియా (60), ఇజ్రాయెల్ (90), దేశాలున్నాయి. ఇక భారత్ విషయానికొస్తే, అణ్వాయుధాల విషయంలో మన దేశం కూడా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నాయని, అది పాక్ కంటే ఎక్కువేనని సిప్రి నివేదించింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని నివేదికలో పేర్కొంది. అలాగే,



చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ అని తెలుస్తోంది. ఇక, 2021-25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే కావడం విశేషం.

# రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనడానికి భారత్‌కు వస్తున్నారు.

మొదటి పేజి తరువాయి

ఆయన పాలనను వ్యతిరేకించే ప్రబలమైన శక్తి ఏదీ రష్యాలో లేదు. ఆయన కోరుకుంటే 2036 వరకు అధికారంలో కొనసాగగలరు. పుతిన్‌కు భారీ భద్రత ఉంటుంది. వందలాది మంది భద్రతాసిబ్బంది 24 గంటలూ ఆయనతోనే ఉంటూ పరిసరాలను నిశితంగా గమనిస్తూ ఉంటారు. పుతిన్ ఆహారాన్ని రహస్యంగా తయారు చేస్తారని, ఆయన తాగే ప్రతి పానీయాన్ని ముందుగా ఆయన అత్యంత సన్నిహిత సలహాదారులు తనిఖీ చేస్తారని బీబీసీ న్యూస్ రిపోర్ట్‌లో ఉంది. కేజీబీ మాజీ అధికారి అయిన పుతిన్‌కు తన చుట్టూ ఉన్న ప్రమాదాల గురించి బాగా తెలుసు. రష్యాలో అనేక భద్రతా సంస్థలు ఉన్నాయి. వాటిలో ఒక సంస్థ ప్రత్యేకంగా అధ్యక్షునికి, ఆయన కుటుంబానికి భద్రత కల్పించడానికే పనిచేస్తుంది. దీనిని రష్యన్ ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ లేదా ఎస్‌బీపీ అని పిలుస్తారు. ఇది రష్యా గూఢచార సంస్థ కేజీబీ నుంచి ఏర్పడిన రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌ఓ)కు రిపోర్ట్ చేస్తుంది. నల్ల సూట్లు ధరించి, చెవులకు ఇయర్‌ఫోన్లు పెట్టుకున్న ఎస్‌బీపీ గార్డులు 24గంటలూ పుతిన్‌తో పాటుంటారు.



"పుతిన్‌తో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఈ ఏజెంట్లు 4 బృందాలుగా విడిపోయి, 4 భద్రతా వలయాలుగా ఏర్పడతారు" అని రష్యా ప్రభుత్వ యాజమాన్యంలోని మీడియా సంస్థ రష్యా బియాండ్ తెలిపింది. ఇందులో మొదటి బృందం అధ్యక్షుడి సమీపంలో ఉంటుంది. ఇందులో ఆయన వ్యక్తిగత గార్డులు ఉంటారు. రెండో వలయంలో ప్రజల దృష్టి పడకుండా ఉండేలా భద్రతా బృందాలను మోహరిస్తారు. మూడో వలయంలో ఉండే బృందం అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తూ, వారు అధ్యక్షుడి వైపు రాకుండా అడ్డుకుంటుంది. చివరిదైనా నాలుగో భద్రతా వలయంలో ఉండే గార్డులు పరిసరాలలో భవనాలపై మోహరిస్తారు. రష్యన్ భద్రతా నిపుణుడు గలియోటి భద్రతా సమస్యలను విశ్లేషించే మాయక్ ఇంటెలిజెన్స్ అనే కన్సల్టింగ్ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్నారు. "పుతిన్‌కు హెలికాప్టర్లు ఇష్టం ఉండవు. ఆయన సాధారణంగా చాలా పెద్ద నల్ల కార్లు, మోటార్ సైకిళ్లపై ఉండే భద్రతా సిబ్బందితో కూడిన భారీ కాన్వాయ్‌లో ప్రయాణిస్తారు. ఆయన ప్రయాణించే సమయంలో కొన్నిసార్లు డ్రోన్లు ఎగరడంపై ఆంక్షలు విధిస్తారు. ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు" అని బీబీసీ ముండోతో మార్క్ గలియోటి చెప్పారు. రష్యన్ ప్రెసిడెన్షియల్ (ఎస్‌బీపీ)కి రష్యన్ నేషనల్ గార్డ్ లేదా రోస్‌గ్వార్డియా మద్దతుగా ఉంటుంది. కొందరు దీనిని అధ్యక్షుని "వ్యక్తిగత సైన్యం"గా పిలుస్తారు. దీని అధికారిక విధుల్లో రష్యా సరిహద్దులను సురక్షితంగా ఉంచడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం వంటివి ఉన్నప్పటికీ ఇది రష్యా సాయుధ దళాలకు భిన్నమైన సంస్థ. వాస్తవానికి పుతిన్‌ను ప్రమాదాల నుంచి కాపాడటమే దీని అత్యంత ముఖ్యమైన పని. "రష్యన్ నేషనల్ గార్డ్ చాలా వరకు పుతిన్ వ్యక్తిగత భద్రత అని అందరికీ తెలుసు" అని యూకేలోని బాత్ విశ్వవిద్యాలయంలో రష్యా విద్యావేత్త స్టీఫెన్ హాల్ బీబీసీ ముండోతో అన్నారు.

# రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిసారి

మొదటి పేజి తరువాయి

విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

### 12.91 లక్షల మందికి కవరేజీ

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

### సింగరేణితో శ్రీకారం

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

### ప్రభుత్వానికి రూపాయి భారం లేదు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

### ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

### కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన



వెల్లడించారు.

### ఉద్యోగులకు హెల్త్‌కార్డు

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్

**బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు

## నారాయణపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



రెబ్బెన మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన సువర్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.42,500 చెక్కును ఆర్టీఏ మెంబర్ లావాద్య రమేష్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా లావాద్య రమేష్ మాట్లాడుతూ అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనమాల మురళి, గంటు మేర, సోనాలి సంతోష్‌బాబు, పల్లె రాజేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, గజ్జల సాయికుమార్, పి. ప్రభాకర్, పల్లె గోపాల్, పల్లె శ్రీనివాస్, ముద్దం నారాయణ, గోలెం రమేష్, ఇందూరి తిరుపతి, గోలెం సత్యనారాయణ, పబ్బ పరిషగౌడ్ తదితరులు పాల్గొన్నారు.సీఎంఆర్ఎఫ్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీల కోసం కాదు.. గ్రామాల అభివృద్ధి కోసమే మన పోరాటం

### అన్ని వర్గాలు ఏకమై ఉద్యమించాలి జేఏసీ పిలుపు తిర్యాణిలో అఖిలపక్ష సమావేశం



తిర్యాణి, . ఈ పోరాటం ఏ ఒక్క వ్యక్తి కోసమో,ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసమో కాదని, తిర్యాణి మండలంలోని ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి కోసమేనని జేఏసీ అధ్యక్షుడు మడావి గున్మంతరావు స్పష్టం చేశారు. తిర్యాణి మండల కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాల సాధనకై జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గున్మంతరావు మాట్లాడుతూ.. మండలంలో ఏళ్లు గడుస్తున్నా, పాలకులు మారుతున్నా అనేక గ్రామాలకు రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి కనీస వసతులు అందని ద్రాక్షగానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతంలో సర్పంచ్‌గా పనిచేసినప్పుడు చేపట్టిన కొన్ని అభివృద్ధి పనులు తప్ప, ఆ తర్వాత ఆశించిన రీతిలో పనులేవీ జరగలేదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా ప్రజలను చైతన్యపరుస్తున్నామని, గతంలో ఇచ్చిన పిలుపునకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని గుర్తుచేశారు. ఇకనైనా మండలంలోని ప్రతి గ్రామం నుంచి యువత, మహిళలు, గ్రామ పెద్దలు, పటేళ్లు పెద్ద సంఖ్యలో కదిలివచ్చి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు భగవంతు రావు, అనిల్ గౌడ్, శంకర్ గౌడ్, శ్రీనివాస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ పటేళ్లు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు

## ఉత్తమ సేవలకు గుర్తింపు.. ఉపాధ్యాయులకు ఘన సన్మానం



తిర్యాని, .. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిర్యాని మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ఈ కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తిరుపతి, మహేష్, రవి, సందీప్, సునీత, రమాదేవి, కేజీబీవీలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న సరస్వతి, ఐఈఆర్పీ సుమన్‌లను తిర్యాని మండల విద్యాధికారి కె. అంజయ్య ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం ద్వారా మిగతా ఉపాధ్యాయుల్లో కూడా మరింత స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, శ్రీనివాస్, దత్తుమూర్తి, సోమశేఖర్, శ్రీనివాస్,ఎస్ ఈ ఆర్ పి యశ్వంత్ , మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. హెడ్డైన్ మార్చి ఇవ్వండి

## రూ.76 లక్షలు తీసుకుని ఇల్లు కట్టకుండా మోసం:

### కాంగ్రెస్ నేతపై బాధితుల ఆరోపణ.

### బెదిరింపులు,కుల దూషణలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్




బెల్లంపల్లి,: ఇల్లు నిర్మించి ఇస్తానని నమ్మించి తమ వద్ద నుంచి రూ.76 లక్షలు వసూలు చేసి మోసగించారని ఆరోపిస్తూ బెల్లంపల్లి పట్టణంలోని 12వ వార్డు కాల్‌టెక్స్‌కు చెందిన బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. తమను కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న 12వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త, కాంగ్రెస్ నాయకుడు నెల్లి రమేష్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బుధవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ బూసి రాజన్న, ఆయన భార్య కృప, కుమారుడు ప్రవీణ్ తమ ఆవేదనను వెల్లడించారు.

### బాధితుడు రాజన్న తెలిపిన వివరాల ప్రకారం కీలక అంశాలు.

### రూ.76 లక్షలు వసూలు నామమాత్రపు పనులు:

2019-2020లో సర్వీసులో ఉన్న సమయంలో నెల్లి రమేష్‌ను నమ్మి ఇంటి నిర్మాణం కోసం విడతలవారీగా రూ.76 లక్షలు అందజేశారు. అందులో కేవలం రూ.20-23 లక్షలతో అసంపూర్తిగా పనులు చేసి అర్ధాంతరంగా ఆపేశారు. మిగిలిన రూ.53 లక్షలకు లెక్కల్లేవు: మిగిలిన సుమారు రూ.53 లక్షల లెక్కలు చూపాలని లేదా డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరినా స్పందించలేదు. బ్యాంక్ పత్రాలు, ఖాళీ చెక్కుల స్వాధీనం, గృహ రుణం ఇప్పిస్తానని చెప్పి బ్యాంకు ద్వారా మంజూరైన రూ.20 లక్షలను కూడా రమేష్ తీసుకున్నారని, అంతేకాకుండా బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డు, పాన్ కార్డుతో పాటు ఖాళీ బాండ్ పేపర్లు, చెక్కులపై సంతకాలు చేయించుకుని తనవద్దే ఉంచుకున్నారని ఆరోపించారు. బాకీ పడ్డ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే కులం పేరుతో దూషిస్తూ, రాజకీయ పలుకుబడి ఉందని బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం ఇచ్చి ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని కన్నీటిపర్యంతమయ్యారు.ఈ వ్యవహారంపై గత నెలలోనే బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై, ఏసీపీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పురోగతి లేదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని, తమ నగదును రికవరీ చేయడంతో పాటు కుల దూషణలకు పాల్పడిన నెల్లి రమేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రాజీయే రాజమార్గం“: మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి ఎస్పీ నితికా పంత్



కుమురం భీం ఆసిఫాబాద్ : రాజీ పడదగిన వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడమే శ్రేయస్కరమని, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదికని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. చిన్న చిన్న తగాదాలను పంతాలకు పోయి పెద్దవిగా మార్చుకోవద్దని, కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, ఆర్థిక వనరులను వృథా చేసుకోవద్దని హితవు పలికారు.

### పరిష్కారమయ్యే ప్రధాన కేసులు:

క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, చిన్నపాటి గొడవలు సివిల్ వివాదాలు, ఆస్తి పంపకాల తగాదాలు కుటుంబ, వైవాహిక సంబంధిత సమస్యలు చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ వివాదాలు విద్యుత్ చౌర్యం కేసులు రాజీ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాలకు ముందస్తు కౌన్సిలింగ్ నిర్వహిస్తారని వివరించారు. పరస్పర అంగీకారంతో వివాదాలు పరిష్కరించుకోవాలనుకునే వారు వెంటనే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి, మెగా లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం పొందాలని ఎస్పీ సూచించారు.

# అనుమతి ముగిసినా.. ఆగని మట్టి దందా!

గడువు ముగిసింది.. గ్రావెల్ దందా ఆగలేదు!

10 వేల టన్నుల అనుమతి.. గడువు దాటినా తవ్వకాలు!

అనుమతి కట్.. తవ్వకాలు మాత్రం ఫుల్!

మైన్స్ శాఖ సీరియస్ బాగ్ హయత్‌నగర్‌లో

మట్టి దందాపై మైన్స్ కొరడా

అనుమతి జూన్ 19కే ముగిసింది.. ఇంకా తవ్వకాలు ఎలా?

గడువు ముగిసినా గ్రావెల్ తరలింపు.. పోలీసులకు మైన్స్ లేఖ

మట్టి తవ్వకాలపై మైన్స్ నిఘా.. పోలీసులకు కీలక ఆదేశాలు

అనుమతి 10 వేల టన్నులకే..

తవ్వింది ఎంత? తరలించింది ఎంత?

హయత్‌నగర్, ఆగస్టు 19, నేటి దిక్సూచి : అనుమతి కాలపరిమితి ముగిసిపోయినా బాగ్ హయత్‌నగర్‌లో గ్రావెల్ తవ్వకాలు, రవాణా కొనసాగుతున్నాయన్న ఫిర్యాదులు అధికారుల్లో కదలిక తెచ్చాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు, గ్రావెల్ తరలింపు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అడ్డుకోవాలని మైన్స్ అండ్ జియాలజీ శాఖ హయత్‌నగర్ పోలీసులను, తహసిల్దార్ కు ఆదేశించింది. బాగ్ హయత్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 90, 291లో గ్రావెల్ తవ్వకాలు, రవాణాపై ఫిర్యాదులు అందినట్లు మైన్స్ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన రంగారెడ్డి



జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. నర్సిరెడ్డి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అధికారిక లేఖ పంపారు.

### 10 వేల మెట్రిక్ టన్నులకే అనుమతి

అధికారుల వివరాల ప్రకారం.. సదరు సర్వే నంబర్లలో 10 వేల మెట్రిక్ టన్నుల గ్రావెల్ తవ్వకం, రవాణాకు ఏకాంబర్ రెడ్డి గుణంపల్లికి తాత్కాలిక అనుమతి మంజూరైంది. అయితే ఈ అనుమతి 2026 జూన్ 19తో ముగిసింది. గడువు ముగిసిన తర్వాత కూడా తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయంటూ ఫిర్యాదులు రావడంతో మైన్స్ శాఖ అప్రమత్తమైంది.

### పోలీసుల సహకారం కోరిన అధికారులు

గ్రావెల్ అక్రమ రవాణాను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు మైన్స్ శాఖలో సిబ్బంది కొరత సమస్యగా ఉందని అధికారులు లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పోలీసుల



BY RPAD

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF MINES & GEOLOGY

From
M.Narsi Reddy, M.Sc.,
Asst. Director of Mines & Geology,
Rangareddy District.

To
The Station House Officer,
Hayathnagar Police Station,
Rangareddy District.

Lr.No.1588/TP/2026, Dt:19-08-2026

Sir,

Sub: Mines & Quarries – Complaints receiving against excavation and transportation of Gravel / Morrum in Sy.No.90 & 291 of BaghHayathnagar Vg., Hayathnagar Mdl., Rangareddy District of Sri.Ekamber Reddy Gunampalli – Request to curtail the illegal excavation and transportation activity – Reg.

* * *

I invite your attention to the subject cited. It is submitted that various complaints have been receiving against the excavation and transportation of Gravel / Morrum in Sy.No.90 & 291 of BaghHayathnagar Vg., Hayathnagar Mdl., Rangareddy District of Sri.Ekamber Reddy Gunampalli.

Earlier, this office issued a temporary permit for transportation of Gravel for a quantity of 10,000MT of Gravel in Sy.No.90 & 291 of BaghHayathnagar Vg., Hayathnagar Mdl., Rangareddy District in favour of Sri.Ekamber Reddy Gunampalli which is expired on 19-06-2026. This office initiating action against the said persons. However, frequently complaints have been receiving against the excavation and transportation activity. Due to meager staff, this office not able to curtail the unauthorized transportation of Gravel / Morrum activity in the said area.

In view of the above, the Station House Officer, Hayathnagar Police Station is requested to issue take necessary for curtail the unauthorized transportation of Gravel in the said above said area. Further, if any action may be initiated under intimation to this office.

Yours faithfully,

Asst. Director of Mines & Geology,
Rangareddy District.

Copy submitted to the District Collector, Rangareddy District for favour of kind information.
Copy submitted to the Director of Mines & Geology, Hyderabad for favour of kind information.
Copy submitted to the Dy. Director of Mines & Geology, Hyderabad for favour of kind information.
Copy to the Tahsildar, Hayathnagar Mandal, Rangareddy District with a similar request.

సహకారంతో అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టాలని కోరారు. బాగ్ హయత్‌నగర్ పరిధిలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వడం లేదా వాహనాల ద్వారా తరలించడం గుర్తిస్తే వెంటనే అడ్డుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. చేపట్టిన చర్యల వివరాలను మైన్స్ శాఖకు తెలియజేయాలని కోరారు.

### తవ్వకాలు ఎంత వరకు జరిగాయి?

ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్, హయత్‌నగర్ తహసీల్దార్‌కు కూడా సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు. అనుమతి గడువు ముగిసిన జూన్ 19 తర్వాత ఇప్పటివరకు ఎంత మేర గ్రావెల్ తవ్వారు? ఎంత పరిమాణంలో తరలించారు? అనేది తేలాల్సి ఉంది. అనుమతికి మించి తవ్వకాలు జరిగి ఉంటే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో చేర్చాలి: టాగ్స్ డిమాండ్

### ఆదివాసీలపై అటవీశాఖ దౌర్జన్యాలు ఆపాలి

### గిరిజన గూడేల్లో మౌలిక వసతులు కల్పించాలి

వేమనపల్లి ‘ట్యాగ్స్’ మహాసభలో జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం

చెన్నూర్, వాస్తవ గమ్యం, సెప్టెంబర్ 10.. అర్హత ఉన్న నాన్ ఏజెన్సీ గ్రామాలను తక్షణమే ఏజెన్సీ పరిధిలోకి తీసుకురావాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టాగ్స్) జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేమనపల్లి మండల కేంద్రంలో మర్మల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ‘ట్యాగ్స్’ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎర్మ పున్నం మాట్లాడుతూ, మండలంలో ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించేందుకు పూర్తి అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, దీనివల్ల ఆదివాసీలు సంక్షేమ ఫలాలకు, అభివృద్ధికి ఆమడదూరంలో మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### అటవీశాఖ అధికారుల వేధింపులు ఆపాలి

పోడు భూములకు హక్కు పత్రాలు ఉన్నప్పటికీ గిరిజనులను సాగు చేసుకోనీయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని



మండిపడ్డారు. అమాయక ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదన్నారు.

### మౌలిక సదుపాయాలు కరువు

మండలంలోని గిరిజన పల్లెలకు సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ కొర్రీలు పెడుతోందని, ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పనులను వేగవంతం చేయాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా పల్లెల్లో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### నూతన మండల కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం ‘ట్యాగ్స్’ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 20 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్ష, కార్యదర్శులు. కర్పెత గణేష్, మర్మల మల్లేశ్వరి ఉపాధ్యక్షులు భాగాల రాజన్న, తలండి గణపతి, కొడితే నారాయణ సహాయ కార్యదర్శులు సిడం సమ్మక్క, దూల చంద్రు, మడే మదనయ్య కమిటీ సభ్యులు: ఎలాది పున్నం, కొమురం శంకర్, కొమురెల్లి సాగర్, మంచాల రాజన్న, బట్టు మదనయ్య, గుడిమేత భూదయ్య, నల్లి రాజకుమార్, సీడం కిష్టయ్య, నాయిని స్వరూప, తొర్రెం సంతోష్, లగ్గామ పార్వతి తదితరులు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మర్మల శంకర్, కొండపల్లి వెంకటి, సీడం పోచం, తలండి గంగారం, సిడం చంద్రయ్య, కిరణ్, మడి వెంకటి, మధునయ్య, పున్నంతో పాటు పలు గ్రామాల ఆదివాసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేశ్ మండపాలకు పోలీసు, విద్యుత్ అనుమతులు తప్పనిసరి.

### ఎస్ఐ సుబ్బారావు

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

### మండపాల వద్ద సీసీ కెమెరాలు, వాలంటీర్లు ఉండాల్సిందే..



తిర్యాణి .. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని తిర్యాణి ఎస్ఐ సుబ్బారావు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, గణపతి మండపాల నిర్వాహకులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండపాల ఏర్పాటుకు పోలీసు, విద్యుత్ శాఖల ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి మండపం నిర్వాహకులు పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ఆదేశించారు.ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు, 24 గంటలూ పర్యవేక్షించేలా స్థానిక వాలంటీర్లను నియమించాలి. రాత్రి వేళల్లో మండపాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలి.విద్యుత్ వైరింగ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా నిపుణులైన ఎలక్ట్రీషియన్లతోనే పనులు చేయించాలి. సౌండ్ సిస్టమ్స్ (డీజేలు, మైకులు) విషయంలో నిర్దేశిత సమయాలు, శబ్ద పరిమితులను కచ్చితంగా పాటించాలి. భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించరాదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖకు స్థానికులు, నిర్వాహకులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ, హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వివిధ గ్రామాల మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మార్లవాయిలో ముమ్మరంగా పంట నమోదు: సర్పంచ్ కనక ప్రతిభ

### మార్కెటింగ్ వెసులుబాటు, ప్రభుత్వ పథకాల కోసమే ఈ ప్రక్రియ..



ఏఈవో వినోదజైనూర్,. రైతులు తాము సాగు చేసిన ప్రతి గుంట భూమిలోని పంట వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మార్లవాయి గ్రామ సర్పంచ్ కనక ప్రతిభ పిలుపునిచ్చారు. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పంట నమోదు (క్రాప్ బుకింగ్) కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి వినోదతో కలిసి సర్పంచ్ రైతులకు పంట నమోదు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రెవెన్యూ భూములతో పాటు అటవీ హక్కు పత్రాలు (ఆర్వోఎఫ్ఆర్) కలిగిన రైతులు సైతం తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేసే పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెట్ సదుపాయాలు, భవిష్యత్ పథకాలు క్షేత్రస్థాయిలో అందాలంటే పంట రికార్డులే ప్రామాణికమని పేర్కొన్నారు. సరైన నమోదు ఉంటేనే మార్కెట్‌కు ఉత్పత్తులను తరలించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విక్రయ ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. గ్రామంలోని అన్నదాతలందరూ వ్యవసాయ సిబ్బందికి సహకరించి, గడువులోగా పంటలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మాణిక్, నాయకులు మేడి గేడం గణపత్, సోయం రాజు, చిత్రు లింబరావు, గ్రామ పంచాయతీ హెల్ప్‌డెస్క్ నిర్వాహకులు కొడప ఆనంద్, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక నిర్వాహకులతో శాంతియుత సమావేశం..




రెబ్బెన మండలంలోని వినాయక నిర్వాహక కమిటీ సభ్యులతో పోలీస్ స్టేషన్లో గురువారం శాంతియుత సమావేశం నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజయ్‌కుమార్, ఎస్ఐ ఏ. వెంకటకృష్ణ లు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, విద్యుత్ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. మండపాల వద్ద జూదం, బెట్టింగ్, బలవంతపు చందాల వసూళ్లు, మద్యం సేవించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావివ్వరాదని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జనం సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తూ ఊరేగింపు, ట్రాఫిక్ నిర్వహణకు సహకరించాలని కోరారు. అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. వినాయక నిర్వాహకులు, కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు.సమావేశంలో వినాయక నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భీమారం మండలంలో డీపీవో పర్యటన.





భీమారం . భీమారం మండలంలో డీపీవో( డిఆర్డిఒ) కిషన్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి గ్రామంలో చేయూత పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. నర్సింగాపూర్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ,వివో,గ్రామపంచాయతీ భవనాలను తనిఖీ చేశారు.అనంతరం భీమారం గ్రామపంచాయతీలో జలసిరి పనులు, బోర్వెల్ రీచార్జ్ నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీణ, ఎంపీవో సతీష్ రెడ్డి, ఏపీవో జీనత్, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గంజాయికి అలవాటు పడిన ముగ్గురి ని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు.




భీమారం . భీమారం మండలానికి చెందిన గంజాయి వినియోగానికి అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులు ఎండీ . హబీబ్ (భీమారం), కృష్ణ ప్రసాద్ (దాంపూర్), వినీత్ (దాంపూర్) లపై భీమారం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వారిని చెన్నూర్ న్యాయస్థానంలో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ వారికి కౌన్సెలింగ్ మరియు పునరావాసం కల్పించే ఉద్దేశంతో మంచిర్యాలలోని ప్రభుత్వ డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమారం ఎస్.ఐ. ఎ . రాజేందర్ తెలిపారు.

## ఐఆర్‌సీటీసీ మనీలాండరింగ్ కేసు కీలక మలుపు..

## లాలూ కుటుంబానికి కోర్టులో బిగ్ షాక్..!



ఐఆర్‌సీటీసీ హోటల్ టెండర్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గురువారం (సెప్టెంబర్ 10, 2026) ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్, భార్య రబ్రీ దేవితో పాటు మొత్తం తొమ్మిది మంది నిందితులపై అభియోగాలు నమోదు చేసింది. ఐఆర్‌సీటీసీ హోటల్ టెండర్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో గురువారం (సెప్టెంబర్ 10, 2026) ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్, భార్య రబ్రీ దేవితో పాటు మొత్తం తొమ్మిది మంది నిందితులపై అభియోగాలు నమోదు చేసింది. ఈ కేసులో సరళా గుప్తా, లారా ప్రాజెక్ట్స్, సుజాత హోటల్స్ తదితరులు కూడా నిందితులుగా ఉన్నారు. ఐఆర్‌సీటీసీకి చెందిన హోటళ్ల టెండర్లలో అవకతవకలు, వాటి ద్వారా అక్రమంగా లబ్ధి పొందినట్లు వచ్చిన ఆరోపణల ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదైంది. విచారణ సందర్భంగా లారా ప్రాజెక్ట్స్ సంస్థ పొందిన ప్రయోజనాలు, ఈ వ్యవహారంలో లాలూ ప్రసాద్ యాదవ్ పాత్రపై అనుమానాలకు దారితీస్తోందని కోర్టు పేర్కొన్నట్లు సమాచారం. అలాగే లాలూపై జరిగిన దర్యాప్తు రాజకీయ ప్రేరేపితమైనదిగా కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. అయితే ఈ కేసులో మరో ఏడుగురు నిందితులను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. తదుపరి విచారణను అక్టోబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. తాజా పరిణామంతో ఈ కేసు మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్ తెలుగు

## రాష్ట్రాల్లో వరుసగా 3 రోజుల సెలవులు!



ఈ సుదీర్ఘ వారాంతం ప్రజా రవాణాకు డిమాండ్ పెరగడానికి కూడా దారితీయవచ్చు. ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణిస్తున్నందున ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. అవసరమైన చోట రవాణా అధికారులు అదనపు సర్వీసులను నడుపుతారని సాధారణ వారాంతపు సెలవులతో పాటు వినాయక చవితి పండుగ కూడా రావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ వారాంతంలో మూడు రోజుల సెలవును ఆస్వాదించనున్నారు. సెప్టెంబర్ 12 నుండి సెప్టెంబర్ 14 వరకు వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసి ఉంటాయి. తద్వారా విద్యార్థులు, ఉద్యోగులకు సుదీర్ఘ వారాంతం లభిస్తుంది. సెప్టెంబర్ 12న నెలలో రెండో శనివారం. దాదాపు చాలా పాఠశాలలు సెలవు ప్రకటిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు మాత్రమే ఆఫ్‌డే ప్రకటిస్తున్నాయి. మరుసటి రోజు సెప్టెంబర్ 13 ఆదివారం. సాధారణంగా దేశ వ్యాప్తంగా ఉండే సెలవు. ఇక సెప్టెంబర్ 14 వినాయక చవితి. ఈ రోజు దేశ వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉంటుంది. ఈ మూడు రోజుల విరామం, పండుగ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ సొంత ఊళ్లకు తిరిగి వెళ్లి కుటుంబంతో గడపడానికి ఒక అవకాశాన్ని కల్పిస్తుందని భావిస్తున్నారు. తమ సొంత జిల్లాలకు దూరంగా నివసించే వారు కూడా ఈ సుదీర్ఘ వారాంతాన్ని చిన్న చిన్న పర్యటనలకు ఉపయోగించుకోవచ్చు. ఈ సుదీర్ఘ వారాంతం ప్రజా రవాణాకు డిమాండ్ పెరగడానికి కూడా దారితీయవచ్చు. ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణిస్తున్నందున ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. అవసరమైన చోట రవాణా అధికారులు అదనపు సర్వీసులను నడుపుతారని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో గణేష్ నవరాత్రికి సన్నాహాలు జరుగుతున్నాయి. నిర్వాహకులు, స్థానిక యువజన బృందాలు నివాస కాలనీలలో ప్రధాన కూడళ్లలో వినాయక మండపాలను ఏర్పాటు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. గణేశ విగ్రహాలను ఎంపిక చేసి వివిధ ప్రదేశాలకు తీసుకువస్తుండగా, పండుగకు ముందు అలంకరణ, ఇతర ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. గణేశ నవరాత్రుల ముగింపును సూచించే గణేశ నిమజ్జనం సమయంలో కొన్ని ప్రాంతాలలో సెలవుల ప్రకటించవచ్చు. స్థానిక పరిస్థితులు, పండుగ ప్రాముఖ్యతను బట్టి, అధికారులు నిమజ్జన ఊరేగింపు కోసం స్థానిక సెలవు దినాన్ని ప్రకటించవచ్చు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో గణేష్ నిమజ్జనం రోజున పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సాంప్రదాయకంగా సెలవు ఇస్తారు. అయితే ఇటువంటి సెలవులు అధికారిక ప్రకటనలపై ఆధారపడి ఉంటాయి.

## మీ క్రెడిట్ కార్డ్ లిమిట్‌లో

## 90% వాడితే ఏమవుతుందో తెలుసా..?




క్రెడిట్ బ్యూరో సంస్థలు పరిగణనలోకి తీసుకునే ముఖ్యమైన అంశాల్లో క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో (సీయూఆర్) కూడా ఒకటి. క్రెడిట్ కార్డు కస్టమర్?కు అనుమితించిన పరిమితిలో ఎంత మొత్తం వినియోగించారో సీయూఆర్ తెలియజేస్తుంది. అందుకే సీయూఆర్ 30 శాతానికి మించనివ్వొద్దు.. ఈ రోజుల్లో ఎవరైనా ఏదైనా కొనాలన్నా లేదా బిల్లు చెల్లించాలన్నా, వారికి మొదటగా గుర్తొచ్చేది క్రెడిట్ కార్డే. ఎందుకంటే అది వెంటనే జేబును ఖాళీ చేయదు. కానీ చెల్లింపు తర్వాత చేయాల్సి ఉంటుంది. అయితే క్రెడిట్ కార్డుతో తరచుగా చేసే ఖర్చు ఖరీదైనది అవుతుందని మీకు తెలుసా? మీరు మీ క్రెడిట్ కార్డును తరచుగా ఉపయోగిస్తే, జాగ్రత్తగా ఉండాలి.

క్రెడిట్ కార్డ్ పరిమితి అంటే ఏమిటి?

మీ బ్యాంక్ మీ క్రెడిట్ కార్డ్‌పై రూ.100,000 పరిమితిని ఇచ్చిందని అనుకుందాం. దీని అర్థం మీరు తదుపరి బిల్లింగ్ సైకిల్ వరకు మీ కార్డ్‌పై రూ.100,000 వరకు మాత్రమే ఖర్చు చేయగలరు. అంతకు మించి కాదు. ఇలాంటి పరిస్థితిలో మీరు ఒక నెలలో మీ క్రెడిట్ కార్డుపై రూ.90,000 ఖర్చు చేస్తే, అది మీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. క్రెడిట్ కార్డును అధికంగా వాడటం అనేది అప్పుపై మీ మితిమీరిన ఆధారపడటాన్ని సూచిస్తుంది. ఇది మీ సిబిల్ స్కోర్‌ను తగ్గించవచ్చు.

బిల్లులను సమయానికి చెల్లించండి:

క్రెడిట్ కార్డును ఉపయోగించేటప్పుడు, నిర్దేశించిన పరిమితిని చేరుకోవడమే కాకుండా, బిల్లును సకాలంలో చెల్లించడం కూడా చాలా ముఖ్యం. ఉదాహరణకు, మీ క్రెడిట్ కార్డు బిల్లు రూ.90,000 అనుకుందాం, మీరు కనీస మొత్తాన్ని చెల్లిస్తే, మీరు వడ్డీతో పాటు మీ జ×దీ×మా స్కోరును కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. ఇలాంటి పరిస్థితిలో ప్రతి నెలా మీ క్రెడిట్ కార్డ్ బ్యాలెన్స్‌ను పూర్తిగా, సకాలంలో చెల్లించడానికి ప్రయత్నించండి. దీనివల్ల మీ క్రెడిట్ స్కోర్ మెరుగుపడటమే కాకుండా, మీ బ్యాంకు విధించే అధిక వడ్డీ ఛార్జీల నుండి కూడా మీరు తప్పించుకోగలరు. మీ కార్డ్ పరిమితిని అత్యవసర పరిస్థితుల కోసం ఉంచుకోవడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. తదుపరిసారి మీరు షాపింగ్ చేసేటప్పుడు లేదా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. మీ క్రెడిట్ కార్డును మితంగా వాడండి. మీ పరిమితిని అత్యవసర పరిస్థితుల కోసం మాత్రమే కేటాయించుకోండి.

క్రెడిట్ వినియోగం

ఇదిలా ఉండగా, క్రెడిట్ బ్యూరో సంస్థలు పరిగణనలోకి తీసుకునే ముఖ్యమైన అంశాల్లో క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో (సీయూఆర్) కూడా ఒకటి. క్రెడిట్ కార్డు కస్టమర్?కు అనుమితించిన పరిమితిలో ఎంత మొత్తం వినియోగించారో సీయూఆర్ తెలియజేస్తుంది. అందుకే సీయూఆర్ 30 శాతానికి మించనివ్వొద్దు. తక్కువ సీయూఆర్ వినియోగం కూడా క్రెడిట్ కార్డు పరిమితిని పెంచడంలో సాయపడుతుంది. అందుకే తక్కువ సీయూఆర్ తక్కువ ఉండేలా చూసుకోవాలి.

## రాత్రి వేళల్లో 'మట్టి' భాగోతం.. నిద్రమత్తులో యంత్రాంగం!

### మహేశ్వరం మండలం గట్టుపల్లి సర్వే నంబర్ 64లో అక్రమ తవ్వకాల రచ్చ
### పేదల లావాణి పట్టా భూములపై వాలుతున్న మట్టి మాఫియా
### కొలతలు వేస్తే బయటపడనున్న అసలు తిమింగలాలు




మహేశ్వరం (నేటి దిక్సూచి): ప్రభుత్వం పేదల సాగు కోసం కేటాయించిన భూములను అక్రమార్కులు కామధేనువుగా మార్చుకుంటున్నారు. పగటిపూట ప్రశాంతంగా కనిపించే ఆ ప్రాంతాలు, రాత్రి కాగానే భారీ యంత్రాల మోతతో విలవిలలాడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 64లో జరుగుతున్న మట్టి తవ్వకాలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**122 ఎకరాల భూమి ఉల్లంఘన:**

గట్టుపల్లి గ్రామానికి చెందిన భూమిలేని నిరుపేదల జీవనాధారం కోసం ప్రభుత్వం సర్వే నంబర్ 64లోని 122 ఎకరాల 33 గుంటల భూమిని లావాణి పట్టాల కింద కేటాయించింది. అయితే, పేద రైతుల చేతుల్లో ఉండాల్సిన ఈ భూమిపై కన్నువేసిన మట్టి మాఫియా.. రాత్రి వేళల్లో భారీ హిటాచీలు, జేసీబీలతో తవ్వకాలు జరుపుతోంది. పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు, పరిశ్రమలకు అక్రమంగా తరలిస్తూ లక్షల రూపాయలు



వెనకేసుకుంటున్నారు. ప్రశ్నల వలయంలో అధికారులు: ఈ భూమిలో తవ్వకాలకు మైనింగ్ లేదా రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులైనా ఉన్నాయా, ఉంటే రాయల్టీ చలానాలు ఏవి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పగలు నిశ్శబ్దంగా ఉంటూ, రాత్రిళ్లు రవాణా సాగిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎందుకు గుర్తించలేకపోతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలిపోతుండటంతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన రాయల్టీ



ఆదాయానికి కూడా పెద్ద ఎత్తున గండి పడుతోంది.

**సమగ్ర సర్వేకు డిమాండ్:**

సర్వే నంబర్ 64లో భూమి గతంలో ఎలా ఉంది, ఎంత పరిమాణంలో మట్టిని తవ్వి తరలించారనే దానిపై డిజిటల్ సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని, తవ్వకాలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి యంత్రాలను సీజ్ చేయాలని కోరుతున్నారు.

## అర ఎకరం నుండి 40 ఎకరాల వరకు

## రూ.80 లక్షల సంపాదన ఓ మహిళా రైతు సక్సెస్ స్టోరీ!



కేవలం ఆమె వ్యక్తిగత విజయ గాథ మాత్రమే కాదు. వ్యవసాయ రంగంలో మహిళలు కేవలం కూలీలుగానే కాకుండా, పెద్ద వ్యాపారాలను నడిపే నాయకులుగా కూడా రాణించగలరని ఇది చూపిస్తుంది. అవమానాలను, ఎగతాళిని అధిగమించి అర ఎకరం నుండి 40 ఎకరాలకు తన వ్యవసాయ.. వ్యవసాయంలో మహిళల పనిపై ఉన్న మూస అభిప్రాయాలను సవాలు చేస్తూ, పంజాబ్‌లోని మోగా నుండి ఒక అద్భుతమైన కథ వెలుగులోకి వచ్చింది. మన్‌దీప్ కౌర్ ఖైరా అనే మహిళ కేవలం అర ఎకరం భూమిలో వ్యవసాయం ప్రారంభించి, నేడు దాదాపు 40 ఎకరాల్లో తన సొంత వ్యవసాయ వ్యాపారాన్ని నడుపుతోంది. ఆమె ప్రయాణంలో అత్యంత విశేషమైన విషయం ఏమిటంటే ఆమె తొలుత వ్యవసాయం ప్రారంభించినప్పుడు పొలాల్లో పనిచేస్తున్నందుకు ప్రజలు ఆమెను ఎగతాళి చేశారు. కానీ ఆమె ఆ అవమానాలను తన బలంగా మార్చుకుంది. మన్‌దీప్ కౌర్‌కు కేవలం అర ఎకరం భూమి మాత్రమే ఉంది. అయినప్పటికీ, తన వ్యవసాయ కార్యకలాపాలను విస్తరించుకోవడానికి, ఆమె మిగిలిన భూమిని కౌలుకు తీసుకుంది. ఈ విధంగా దృఢ సంకల్పం ఉంటే, పరిమిత భూమిలో కూడా వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేయవచ్చని ఆమె నిరూపించింది. నేడు ఆమె 40 ఎకరాల విస్తీర్ణంలో అంటే ఒక పెద్ద వ్యవసాయ క్షేత్రాన్ని సాగు చేస్తోంది. ఇది కేవలం భూమిని విస్తరించుకోవడం వల్ల వచ్చిన ఫలితం కాదు, వ్యవసాయాన్ని ఒక వ్యాపారంగా చూస్తూ నిర్వహించడం వల్ల వచ్చిన ఫలితం.

**మూడు ట్రాక్టర్లు, ఏడు ట్రాలీలు, రూ. 80 లక్షల విలువైన పరికరాలు:**

మన్‌దీప్ కౌర్ తన వ్యవసాయ విస్తీర్ణాన్ని పెంచుకోవడంతో పాటు, వ్యవసాయ యంత్రసామగ్రిపై కూడా భారీగా పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఆమె వద్ద మూడు ట్రాక్టర్లు, ఏడు ట్రాలీలు, ఇంకా అనేక ఇతర వ్యవసాయ పరికరాలు ఉన్నాయి. ఒక నివేదిక ప్రకారం, ఈ పరికరాలన్నింటి మొత్తం ఖరీదు సుమారు రూ.80 లక్షలు. ఇది ఆమె ఒక చిన్న స్థాయి నుండి ఒక పెద్ద వ్యవసాయ వ్యాపారంగా ఎలా రూపాంతరం చెందిందో స్పష్టంగా చూపిస్తుంది.

**ఎంతో మంది ఎగతాళి చేశారు:**

ఒక మహిళ ట్రాక్టర్ నడుపుతూ పొలాల్లో పనిచేస్తుంటే, కొంతమంది ఆమెను ఎగతాళి చేయడం సహజం. మన్‌దీప్‌కు సరిగ్గా ఇదే జరిగింది. కానీ ఆమె వెనకడుగు వేయలేదు. ఆమె తన పనిపై నమ్మకాన్ని నిలబెట్టుకుని వ్యవసాయం కొనసాగించింది. నివేదికల ప్రకారం, నేడు అదే వ్యవసాయం ఆమెకు ఏటా సుమారు 80 లక్షల రూపాయలు సంపాదించిపెట్టే వ్యాపారంగా మారింది.

**భూమి ఉండటం కంటే అవకాశాన్ని అందిపుచ్చుకోవడమే ముఖ్యం:**

పంజాబ్‌లో వ్యవసాయం కోసం భూమిని కౌలుకు తీసుకోవడం సర్వసాధారణం. కానీ మన్‌దీప్ కౌర్ కథ ఆమె పట్టుదలను తెలియజేస్తుంది. మీకు పరిమితమైన భూమి ఉన్నప్పటికీ, భూమిని కౌలుకు తీసుకుని దానిని సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ఒక పెద్ద వ్యవసాయ వ్యాపారాన్ని నిర్మించవచ్చని ఆమె నిరూపిస్తుంది. మన్‌దీప్ కౌర్ ప్రయాణం కేవలం ఆమె వ్యక్తిగత విజయ గాథ మాత్రమే కాదు. వ్యవసాయ రంగంలో మహిళలు కేవలం కూలీలుగానే కాకుండా, పెద్ద వ్యాపారాలను నడిపే నాయకులుగా కూడా రాణించగలరని ఇది చూపిస్తుంది. అవమానాలను, ఎగతాళిని అధిగమించి అర ఎకరం నుండి 40 ఎకరాలకు తన వ్యవసాయ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న మన్‌దీప్ కథ. చాలా మందికి ఆమె సక్సెస్ ఒక దర్శనమనే చెప్పాలి.

## కెనరా బ్యాంక్ ఖాతాదారులకు బ్యాడ్‌న్యూస్

## ఏటీఎం సేవల ఛార్జీలు పెంపు కొత్త నిబంధనలు ఇవే!



కెనరా బ్యాంక్ కస్టమర్లు తమ ఏటీఎం వినియోగాన్ని మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడం అవసరం. అనవసరమైన ఛార్జీలను నివారించడానికి తమ నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను ట్రాక్ చేసుకోవాలి. డిజిటల్ బ్యాంకింగ్ పద్ధతులు, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్.. భారతదేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన కెనరా బ్యాంక్, ఏటీఎం లావాదేవీలకు సంబంధించిన తన ఛార్జీల నిర్మాణంలో గణనీయమైన మార్పులను ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు 2026 సెప్టెంబర్ 1 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. కస్టమర్లు తమ నెలవారీ బ్యాంకింగ్ అలవాట్లను, ఖర్చులను ప్రభావితం చేసే ఈ మార్పుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**ఉచిత లావాదేవీల పరిమితిలో మార్పులు:**

సాధారణ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాదారులకు కెనరా బ్యాంక్ ఏటీఎంలలో చేసుకునే ఉచిత లావాదేవీల సంఖ్య సవరించింది. ఇప్పటివరకు, ఒక క్యాలెండర్ నెలలో ఆరు ఉచిత లావాదేవీలు (ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు కలిపి) చేసుకునే అవకాశం ఉండేది. అయితే, 2026 సెప్టెంబర్ 1 నుండి ఈ పరిమితి నెలకు ఐదు ఉచిత లావాదేవీలకు తగ్గిస్తూ నిర్ణయించింది. అంటే, ఒక ఖాతాదారుడు ఐదు లావాదేవీల తర్వాత చేసే ప్రతి ఏటీఎం లావాదేవీకి ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మార్పు ముఖ్యంగా ఏటీఎంలను తరచుగా ఉపయోగించే వారికి ఆర్థిక భారాన్ని పెంచుతుంది. సీనియర్ సిటిజన్ల కోసం ఉచిత లావాదేవీల పరిమితిలో ఎటువంటి మార్పు లేదు. వారికి నెలకు ఎనిమిది ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితి యథావిధిగా కొనసాగుతుంది. ఇది వారికి కొంత ఊరటనిచ్చే అంశం.

**నగదు ఉపసంహరణ ఛార్జీల పెరుగుదల:**

ఉచిత లావాదేవీల పరిమితిని దాటిన తర్వాత చేసే నగదు ఉపసంహరణ (ఆర్థిక లావాదేవీలు) ఛార్జీలు పెరిగాయి. ఇంతకుముందు ప్రతి లావాదేవీకి రూ.20 ం GST వసూలు చేయగా, ఇప్పుడు అది రూ.23 ం GST కి పెంచింది. ఇది లావాదేవీకి రూ.3 పెరుగుదల, ఇది తరచుగా అదనపు లావాదేవీలు చేసే వారికి ఖర్చును పెంచుతుంది.

బ్యాలెన్స్ సరిపోకపోతే వర్తించే పెనాల్టీలో మార్పు:

ఏటీఎం లావాదేవీలలో కస్టమర్లు ఎదుర్కొనే సాధారణ సమస్యలలో ఒకటి ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేకపోవడం వల్ల లావాదేవీ తిరస్కరణకు గురికావడం. ఇంతకుముందు, అటువంటి సందర్భంలో రూ.17 ం GST పెనాల్టీ విధించేవారు. 2026 సెప్టెంబర్ 1 నుండి ఈ ఛార్జీ కూడా గణనీయంగా పెరిగి రూ.23 ం GST కి చేరుకుంది. ఇది ఖాతాదారులు తమ ఖాతా బ్యాలెన్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది.

**ఆర్థికేతర లావాదేవీల ఛార్జీలు:**

ఆర్థికేతర లావాదేవీలు అంటే ఏటీఎం కార్డును ఉపయోగించి బ్యాలెన్స్ ఎంక్వైరీ చేసుకోవడం లేదా మినీ స్టేట్‌మెంట్ తీసుకోవడం వంటివి. ఈ లావాదేవీల ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. ఉచిత పరిమితి దాటిన తర్వాత కూడా ప్రతి ఆర్థికేతర లావాదేవీకి రూ.5 ం GST ఛార్జీ యథావిధిగా వర్తిస్తుంది.

**కస్టమర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

ఈ మార్పుల నేపథ్యంలో కెనరా బ్యాంక్ కస్టమర్లు తమ ఏటీఎం వినియోగాన్ని మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడం అవసరం. అనవసరమైన ఛార్జీలను నివారించడానికి తమ నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను ట్రాక్ చేసుకోవాలి. డిజిటల్ బ్యాంకింగ్ పద్ధతులు, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ వంటివి ఉపయోగించడం ద్వారా కొన్ని లావాదేవీలను ఏటీఎంలకు వెళ్లకుండానే పూర్తి చేయవచ్చు, తద్వారా ఛార్జీలను ఆదా చేసుకోవచ్చు. బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ లేదా కస్టమర్ కేర్ ద్వారా తాజా ఛార్జీలు, నిబంధనలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం మంచిది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815